క్లుప్తంగా...

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటారూ.13, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 45, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 47, పచ్చకాకర 45, పందిరి బీర 45, క్యాబేజీ 15, క్యారెట్ 20, దొండ 23, గుండుబీన్స్ 65, గింజ చిక్కుడు 65, గోకరకాయ 55, కీర 14, దోసకాయ 23, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 23, చామగడ్డ 55, మొరంగడ్డ 18, కందగడ్డ 40, సొరకాయ 9, పొట్లకాయ 15, అరటికాయ 9, మునగకాయ 4-6, ముల్లంగి 3-5. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

విద్యార్థులకు ట్రాఫిక్‌పై అవగాహన

కంటోన్మెంట్: విద్యార్థి దశలోనే ట్రాఫిక్ పట్ల అవగాహన కల్పించుకోవడం ఎంతైనా అవసరముందని బేగంపేట ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్ రాజు అన్నారు. మంగళవారం బోయిన్‌పల్లిలోని సెయింట్ పీటర్స్ హైస్కూల్‌లో విద్యార్థులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. స్టాప్ లైన్, రాంగ్ రూట్, ట్రిబుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ టి. అల్ఫోన్స్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సువర్ణ, ట్రాఫిక్ ఎస్‌ఐ జ్యోతి పాల్గొన్నారు.

మంత్రుల రాకను అడ్డుకునే యత్నం

- విద్యార్థి నేతల అరెస్ట్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూకు మంత్రుల రాకను అడ్డుకునేందుకు యత్నించిన విద్యార్థి నేతలను ఓయూ పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం హాస్టల్ భవనం శంకుస్థాపనకు విచ్చేసిన విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, హోంమంత్రి మహ్మద్ అలీని అడ్డుకునేందుకు బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వేల్పుల సంజయ్, ఉపాధ్యక్షులు వేణుగోపాల్, ఓయూ జాక్ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేస్తూ రోడ్డు పైకి రాగా పోలీసులు అరెస్ట్ చేశారు.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్


ఇఫ్తార్ విందుకు హాజరైన రెహమత్‌బేగ్

సనత్‌నగర్: ఇఫ్తార్ వేడుకలు మతసామరస్యాన్ని ప్రతీకగా నిలుస్తున్నాయని ఎమ్మెల్సీ రెహమత్ బేగ్ అన్నారు. ఏఐఎంఐఎం సనత్‌నగర్ అధ్యక్షుడు షౌకత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు హాజరైన ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. రంజాన్ మాసం సేవాకు నిదర్శనమన్నారు. కుల, మతాలకతీతంగా అందరూ కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొని ఐకమత్యాన్ని చాటుతారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీ బాల్‌రెడ్డి, నాయకులు బాల్‌రెడ్డి, అన్వర్‌సాదత్, షరీఫ్, జానీమియా పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కృష్ణవేణి సుస్వరాలు

చిక్కడపల్లి: శ్రీకృష్ణ ఆర్ట్స్, కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సిటీకల్చరల్ సెంటర్‌లో నిర్వహించిన కృష్ణవేణి సుస్వరాల కార్యక్రమం ఆకట్టుకుంది. 27వ సినీ సంగీత కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన విభావరిలో 30 మంది గాయకులు 7 భాషల్లో 145 పాటలతో 13 గంటలపాటు నిర్విరామ సినీగీతాల కార్యక్రమం నిర్వహించారు. గాయని కృష్ణవేణి, శ్రీనివాస్‌రావుతో పాటు పలువురు గాయనీగాయకులను ఈ సందర్భంగా అభినందించారు. వండర్‌బుక్ ఆఫ్ రికార్డ్, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ఆయా రికార్డ్ సంస్థల ప్రతినిధులు బింగి నరేందర్‌గౌడ్, సుభాషిణిలు, ఆల్ రౌండర్ గాయనీ కృష్ణవేణికి అందజేశారు.

'అంతర్జాతీయ నదీ తీరాలలో మా నడక' శైలి ఆసక్తికరం

చిక్కడపల్లి: 'అంతర్జాతీయ నదీతీరాలలో మా నడక సంపుటి'లో నర్మదారెడ్డి భాషశైలి ఆసక్తికరంగా ఆద్యంతం చదివిస్తుందని ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి అభినందించారు. మంగళవారం రాత్రి చిక్కడపల్లి త్యాగరాయగానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.రమణాచారి మాట్లాడుతూ.. నర్మద తన సహచారుడు ఇంద్రారెడ్డితో కలిసి 150 దేశాల్లో పర్యటించి వారి అనుభవాలను ఆకట్టుకునే విధంగా రాశారని పేర్కొన్నారు. ప్రపంచంలోని ఏడు నదీతీరాల విశేషాలు తెలుగు వారికి పరిచయం చేసిన నర్మద జాతికి గొప్పసేవ చేశారని డాక్టర్ వాడ్రేవు చిన వీరభద్రుడు అన్నారు. జర్నలిస్ట్ జయసూర్య సంపుటిని విశ్లేషించారు. సభలో నర్మద తన సంపుటిని భర్తకు లాంఛనంగా అంకితమిచ్చారు. సంఖ్యాశాస్త్ర వేత్త దైవజ్ఞశర్మ, రఘుశ్రీ తదితరులు పాల్గొని ఉగాది పురస్కారాలను ప్రముఖులకు బహూకరించారు.


జ్యోతిరావుపూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం


పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ నాయకులు

పూలే జీవితం..ఆదర్శనీయం

మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని మంగళవారం సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ జోన్లలో పూలే విగ్రహాలు, చిత్రపటాలకు నివాళులర్పించారు. రాష్ట్రంలోనే తొలిసారిగా మహాత్మాజ్యోతిరావు పూలే రీసెర్చ్ సెంటర్‌ను ఓయూలో ఏర్పాటు చేశారు. ఓయూలో నిర్వహించిన పూలే జయంతిలో రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం పాల్గొని నివాళులర్పించారు. బీసీ సంక్షేమ శాఖ బడ్జెట్ నుంచి రూ.5 లక్షలను అందచేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

–సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ జోన్ల బృందం


లాలాపేటలో నివాళి అర్పిస్తున్న శ్రీలతా శోభన్‌రెడ్డి


పూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బుర్ర వెంకటేశం


జ్యోతిరావు పూలేకు నివాళులర్పిస్తున్న శ్యామ్ సుందర్‌గౌడ్


బేగంపేట ఓల్డ్ కస్టమ్స్‌బస్తీలో..


సనత్‌నగర్ నెహ్రూ పార్కు వద్ద ..


ఆర్ట్స్ కాలేజీ ఎదుట..


పూలేకు నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి

మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట


రంజాన్ కానుకలను పంపిణీ చేస్తున్న పద్మారావుగౌడ్, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డి

లాలాపేట: తెలంగాణ రాష్ట్రంలో మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ అన్నారు. మంగళవారం తార్నాక డివిజన్ ఆర్యనగర్ మసీదు వద్ద ముస్లింలకు రంజాన్ కానుకల పంపిణీ కార్యక్రమాన్ని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డితో కలిసి పద్మారావుగౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల, మత భేదం లేకుండా అన్ని పండుగలకు సమ ప్రాధాన్యం కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే దక్కిందన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జునైద్, నాగేశ్వర్‌రావు, సునీల్, సంతోషమ్మ, అనసూయ, పద్మ, ప్రదీప్, నాగరాజు, కుమార్ షాను పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ భోలక్‌పూర్‌లో మంగళవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు పెద్ద ఎత్తున శిబిరానికి చేరుకుని కంటి పరీక్షలు చేయించుకున్నారు. శిబిరానికి హాజరైన మాజీ కార్పొరేటర్ ఏసూరి సావిత్రి, నాయకులు మహేష్ మాట్లాడారు. కంటి వెలుగు కార్యక్రమం పేదలకు వైద్యపరంగా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కంటి సమస్య ఉన్న వారు పరీక్షలు చేయించుకోవాలని అవసరమైన వారికి ఉచితంగా అద్దాలు అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఇసాక్, సత్తమ్మ, నాయకులు ఏసూరి మహేష్, రాజు, వెంకట్ ముదిరాజ్, డి. జనార్దన్, గోవింద్, వరలక్ష్మి, శ్రీరాములు, గురుమూర్తి పాల్గొన్నారు.


కంటి శిబిరాన్ని సందర్శించిన నాయకులు

హునార్ మహోత్సవ్‌లో కృతికా రాయ్ సందడి

రసూల్‌పురా: సికింద్రాబాద్ జింఖనా మైదానంలో ఏర్పాటు చేసిన హునార్ మహోత్సవ్ ఫెస్టివల్ ప్రదర్శనలో అన్ని రాష్ట్రాల కళా ఖండాలు, వస్త్రాలు ఒకే వేదికపై అందుబాటులో ఉన్నాయని నటి కృతికా రాయ్ అన్నారు. మంగళవారం జింఖానా మైదానంలో డాక్టర్ మలంగ్ ఆధ్వర్యంలో ప్రారంభమైన హునార్ మహోత్సవ్‌లో కృతికారాయ్ హాజరై సందడి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కళాకారుల నుంచి కళ, కళాఖండాలు, చేతి పనులు, వస్త్రాలు, హస్త కళలు, వివిధ రాష్ట్రాల అతి మధురమైన, రుచికరమైన వంటలు నగర ప్రజలకు అందుబాటులో ఉన్నాయన్నారు. మలంగియా ఆర్ట్స్ మేనేజింగ్ డైరెక్టర్ రిషికుమార్ ఝా మాట్లాడుతూ.. భారతీయ హస్తకళలు, కళాకారులను ప్రోత్సహించే విధంగా దేశ వ్యాప్తంగా హునార్ మహోత్సవ్ పేరుతో ప్రదర్శన, ఫెస్టివల్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.


సందడి చేస్తున్న నటి కృతికా రాయ్

సంస్కృతి సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాలి

చిక్కడపల్లి: మన సంస్కృతి సంప్రదాయలను భవిష్యత్ తరాలకు అందించాలని సినీనటుడు రఘుబాబు అన్నారు. త్యాగరాయగానసభలో సాలంభంజిక స్టూడియో ఆర్ట్స్ అండ్ పర్ఫార్మెన్స్ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘుబాబు మాట్లాడుతూ.. సాలంభజిక సంస్థ ఎందరో కళాకారులను తీర్చిదిద్ది ప్రోత్సహిస్తోందన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు భామా కలాపం, రామపట్టాభిషేకం, కావడి చిందు, పూజారిణి తదితర నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం వెంకట్ సతీమణి రిందావెంకట్, నాట్యాచార్యులు శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు. ప్రముఖులు పాలపర్తి సంధ్యారాణి, సూర్యనాథ్, రాజు, దాసరి, డాక్టర్ పట్టాలి ధన్యామీనన్, దీప పట్టాలి, రమా, వాణి సుందరి తదితరులున్నారు.


రిందావెంకట్‌ను సన్మానిస్తున్న సినీనటుడు రఘుబాబు

రేపటి నుంచి శోభానాయుడు జయంత్యుత్సవ్

చిక్కడపల్లి: నృత్య గురువు శోభానాయుడు జయంత్యుత్సవ్ కార్యక్రమాన్ని త్యాగరాయగానసభలో ఈనెల 13, 14న నిర్వహిస్తున్నట్లు శిష్య బృందం ఓ ప్రకటనలో తెలిపారు. తొలిరోజు ముఖ్య అతిథిగా నాట్యగురువు పద్మజారెడ్డి పాల్గొని మృదంగ కళాకారుడు పీఆర్‌సీ శర్మను సత్కరిస్తారన్నారు. నాట్యశాఖ ఆచార్యులు జొన్నలగడ్డ అనురాధ పాల్గొని ప్రముఖ గాయకుడు అమలాపురం కన్నారావును సత్కరిస్తారని సమాచారం.

కార్మికుల జీవితాల్లో వెలుగు నింపేందుకు ఎర్రజెండా పోరాటం

అడ్డగుట్ట: ఇంజినీరింగ్ కార్మికుల జీవితాల్లో వెలుగు నింపేందుకు ఎర్రజెండా నిరంతరం పోరాట ఫలితంగా రూ. 4,200 గ్రేడ్ పే ఇచ్చేందుకు రైల్వే బోర్డ్ అధికారులు అంగీకరించినట్లు మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్. శంకర్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైల్వేలో అహర్నిశలు శ్రమిస్తూ కనీస వేతనాలు అందక ఇబ్బంది పడుతున్న ఇంజినీరింగ్ కార్మికులకు ఎర్రజెండా మరోమారు అండగా నిలిచిందన్నారు. దాని ఫలితంగానే ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రూ. 4,200 గ్రేడ్‌పే లెవెల్ 6 గరిష్ట వేతనానికి ఎట్టకేలకు న్యూ ఢిల్లీలో జరిగిన రైల్వే బోర్డ్ ఏఐఆర్ఎఫ్-పీఎన్ఎం సమావేశంలో అధికారులు అంగీకారం తెలిపారు. భారతీయ రైల్వేలో అత్యధిక సంఖ్యలో ఉండి, పట్టాల రక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న ట్రాక్‌మెన్‌లు ఇదివరకు లెవెల్ 5 వరకు మాత్రమే ప్రమోషన్లు, గ్రూప్-సీ ఉద్యోగులకు లెవెల్ 8 వరకు మాత్రమే ఉండేవని తెలిపారు. ఈ వివక్షకు వ్యతిరేకంగా ఆల్ ఇండియా రైల్వేమెన్ ఫెడరేషన్ చేస్తున్న పోరాటానికి ఎట్టకేలకు ఫలితం దక్కిందన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఏబీవీపీ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ప్రకటించారు. ఓయూలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో అధ్యక్షుడిగా సిలువేరు అశోక్, కార్యదర్శిగా బట్టు పరుశరామ్‌ను ప్రకటించినట్లు ఏబీవీపీ రాష్ట్ర నాయకులు జీవన్ తెలిపారు. ఓయూ భూముల పరిరక్షణతో పాటు హాస్టల్, స్కాలర్‌షిప్స్, అకాడమిక్, ఇతర సమస్యలపై పోరాడనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు పేర్కొన్నారు.

క్రైం కార్నర్..

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

అడ్డగుట్ట: పుట్టింటికి వెళ్లిన భార్య తిరిగి రావడం లేదని మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం. మేడ్చల్‌లోని వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన నరేష్(27) ప్రైవేటు ఉద్యోగి. ఇతని వివాహమై కొన్ని నెలల తరువాత పుట్టింటికి వెళ్లిన భార్య ఇంటికి రాలేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన నరేష్ మంగళవారం ఉదయం దబీల్‌పుర నుంచి మనోహరబాద్ రైల్వే స్టేషన్ల మార్గం మధ్యలోని పట్టాల వద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు.

ముగ్గురు మహిళలకు జైలు

అడ్డగుట్ట: బస్తీలో జరిగిన గొడవలో ఓ మహిళకు అబార్షన్ అవ్వడానికి కారణమైన ముగ్గురు మహిళలకు మూడ్రోజుల సోషల్ సర్వీస్‌తో పాటు రూ. 20 వేల జరిమానా విధించిన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప వివరాల ప్రకారం.. ఈ నెల 4న మధ్యాహ్నం శిరీష అంబేడ్కర్ నగర్‌లోని తన పుట్టింటికి వచ్చింది. ఈ క్రమంలో పాత గొడవలు మనస్సులో పెట్టుకొని అదే ప్రాంతానికి చెందిన ముగ్గురు మహిళలు సంగీత, గాయత్రి, అన్నపూర్ణ శిరీష అన్న సంతోష్‌తో గొడవ పెట్టుకున్నారు. గొడవను అడ్డుకునేందుకు వెళ్లిన శిరీషను ఆ ముగ్గురు మహిళలు తోసేశారు. కొన్ని రోజుల తర్వాత శిరీషకు అబార్షన్ కావడంతో ముగ్గురు మహిళలపై ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం 15వ మెజిస్ట్రేట్ సదరు ముగ్గురు మహిళలకు మూడ్రోజుల సోషల్ వర్క్‌తో పాటు రూ. 20 వేల నష్టపరిహారం బాధితురాలికి ఇవ్వాలని తీర్పునిచ్చారు.

'దళితులను అవమానిస్తున్న బీఆర్ఎస్'

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లో ఓ దళితుడు కాకుండా మరో వ్యక్తిని ఇన్‌చార్జ్‌గా నియమించి బీఆర్ఎస్ దళితులను అవమానిస్తోందని బీజేపీ మహంకాళి జిల్లా అధికార ప్రతినిధి బీఎన్ శ్రీనివాస్ అన్నారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ విజయానంద్, కో కన్వీనర్ సతీష్, ఎమిదో వార్డు అధ్యక్షుడు కిరణ్, సీనియర్ నేత శ్రీకాంత్, రాజమల్లేశ్‌లతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. లాల్ బజార్లో డంపింగ్ యార్డు ఏర్పాటు ఎవరి హయాంలో తెలుసుకుని మాట్లాడాలన్నారు. ఓట్ల తొలగింపు సమయంలోనూ బోర్డులో బీఆర్ఎస్ పార్టీ నేతలే బోర్డు సభ్యులుగా ఉన్నారని, అప్పట్లో వారు ఎందుకు అడ్డుకోలేదన్నారు. బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజశేఖర్ రెడ్డి కానీ, ఆయన మామ మంత్రి మల్లారెడ్డి ఏనాడూ తెలంగాణ ఉద్యమంలో పాల్గొనలేదని అన్నారు. దివంగత ఎమ్మెల్యే సాయన్న అంత్యక్రియలు అధికారిక లాంఛనాలతో నిర్వహించకుండా అవమానించిన విషయాన్ని ప్రజలు గుర్తుంచుకుంటారని అన్నారు. బ్రోకర్ వ్యవస్థ, దోపిడీల గురించి బీఆర్ఎస్ నేతలు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు.కంటోన్మెంట్‌లో రామకృష్ణ వల్లే అభివృద్ధి జరుగుతోందన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నేతలు

పేద ముస్లింలకు అండగా ఉంటా


రంజాన్ కానుకలను అందజేస్తున్న మర్రి రాజశేఖర్ రెడ్డి


రంజాన్ కిట్‌లు పంపిణీ చేస్తున్న గజ్జెల నాగేశ్

కంటోన్మెంట్: పేద ముస్లింలకు తన వంతుగా సహకారం అందజేస్తానని రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేశ్ అన్నారు. మంగళవారం ఆరో వార్డు వాహినీనగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో స్థానిక మహిళలకు సొంత నిధులతో రంజాన్ కిట్లను అందజేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గంలోని పేదల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. 2014లో స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలైన తనకు ఈ సారి ప్రజలు అండగా ఉండాలని కోరారు. తాను ఎమ్మెల్యేగా గెలిస్తే మరింత అభివృద్ధి, సంక్షేమ ఫలాలు నియోజకవర్గ ప్రజలకు అందేలా చూస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో అబ్బు, యాసిన్, నయీం, షర్ఫు, నగేష్, జంగలి రాజు, రావుల సతీష్, శ్రీనివాస్, మారుతి పాల్గొన్నారు.

రంజాన్ తోఫాల అందజేత

రసూల్‌పురా: అన్ని పండగలకు సీఎం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని కంటోన్మెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మూడవ వార్డు కార్ఖాన మసీద్ సమీపంలో బోర్డు మాజీ సభ్యుడు బి. ప్రభాకర్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు రంజాన్ కానుకలను అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నివేదిత, జక్కుల మహేశ్వర్‌రెడ్డి, నళిని కిరణ్, పాండుయాదవ్, మీర్జా, అహ్మద్, పార్టీ అక్తర్ పాల్గొన్నారు.

వైద్య సదుపాయం కల్పించలేని స్థితిలో పాలకులు


దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న కార్తీకరెడ్డి

లాలాపేట: ప్రజల కనీస సదుపాయం వైద్య సేవలందించేందుకు హాస్పిటల్‌ను ఏర్పాటు చేయలేని దుస్థితిలో నేటి పాలకులు ఉన్నారని బీజేపీ నాయకురాలు బండ కార్తీకరెడ్డి అన్నారు. మాణికేశ్వర్‌నగర్‌లో హాస్పిటల్ ఏర్పాటు చేయాలంటూ స్థానిక అఖిల పక్షం ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షకు మంగళవారం ఆమె మద్దతు తెలిపి మాట్లాడారు. మహానగరం హైదరాబాద్ నడిబొడ్డున సికింద్రాబాద్ నియోజక వర్గంలో గత వారం రోజుల నుంచి హాస్పిటల్ ఏర్పాటు చేయాలంటూ ఆ బస్తీ ప్రజలు దీక్షలు చేస్తున్నా ఇప్పటి వరకు ప్రభుత్వం కానీ స్థానిక ప్రజాప్రతినిధులు ఎందుకు స్పందించడం లేదన్నారు. గతంలో రెండు పర్యాయాలు జరిగిన ఎన్నికల్లో హాస్పిటల్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ ఏమైందన్నారు. రెండు పర్యాయాలు గతంలో మంత్రి, ప్రస్తుతం డిప్యూటీ స్పీకర్‌గా ఉన్నవారు హాస్పిటల్ ఏర్పాటు చేసే అవకాశం ఉన్నప్పటికి చేయడానికి మనస్సు రావడం లేదా అన్నారు. న్యాయమైన డిమాండ్ కోసం ఉద్యమిస్తున్న మాణికేశ్వర్‌నగర్ వాసులు సమస్యను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. దీక్షలో నరేష్, నాగరాజు, బోదాసు రాము, చిన్న, శ్రీకాంత్, సేతు, రాజేష్, చిన్న, సత్తి, హరి, గండికోట విజయ్‌కుమార్, లింగయ్య, శ్రీనివాస్, గండికోట నర్సింహ, వీరన్న, కిరణ్‌గౌడ్ పాల్గొన్నారు.

మరాఠా బస్తీ సందర్శన

అడ్డగుట్ట: డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ ఆదేశానుసారం మరాఠా బస్తీలో డబుల్ బెడ్రూమ్ ఇళ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె హౌసింగ్ అధికారులతో కలిసి మరాఠా బస్తీని సందర్శించి మాట్లాడారు. సోమవారం మరాఠా బస్తీలోని పురాతన భవనం మెట్లు కూలి పలువురు గాయపడగా సదరు భవనాలను పూర్తిగా తొలగించి వాటి స్థానంలో డబుల్ బెడ్రూమ్ ఇళ్లు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని డిప్యూటీ ఆదేశించినట్లు తెలిపారు. కార్పొరేటర్ వెంట గ్రంథాలయ డైరెక్టర్ లింగాని శ్రీను, హౌసింగ్ ఈఈ దాస్, డీఈ గంగాధర్, బస్తీవాసులు ఉన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న ప్రసన్నలక్ష్మి

వేసవిలో తాగునీటి ఎద్దడి రానివ్వొద్దు

వెంగళరావునగర్ : వేసవిలో ప్రజలు నీటికి ఇబ్బందులు పడే అవకాశం ఉన్నందున నిరంతరం జలమండలి సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని కార్పొరేటర్ దేదీప్య విజయ్ పేర్కొన్నారు. గత వారంరోజులుగా డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో నీరు రాక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. జవహర్‌నగర్‌లోని కొన్ని ప్రాంతాల్లో వారం రోజులుగా నీరు రావడంలేదని జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడంతో సమస్యను కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. హుటాహుటిన ఆమె మంగళవారం జవహర్‌నగర్ బస్తీలో పర్యటించి జలమండలి అధికారులు, సిబ్బందిని పిలిపించి సమస్యను వివరించారు. సాధ్యమైనంత త్వరలో సమస్యను పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ డీజీఎం వాహబ్, నాయకులు విజయ్‌కుమార్, అఫ్జర్, చోటూ, ఇస్మాయేల్, గణేష్‌సింగ్, వినోద్, షోయబ్ పాల్గొన్నారు.


స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్

స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో పనిచేస్తున్న స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ఐకేపీవీఓఏ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థలో వివిధ గ్రామ స్థాయిలో 17,606 మంది వీఓఏలు పనిచేస్తున్నారన్నారు. 19 ఏళ్ల నుంచి గ్రామాల్లో మహిళల అభ్యున్నతికి మహిళల స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేస్తూ.. వారిని ఆర్థిక, సామాజికంగా ఎదిగేందుకు అవగాహన కల్పిస్తున్నారన్నారు. అలాంటి వారిని ప్రభుత్వం కార్మికులుగా గుర్తించి కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. చిరువ్యాపారాలు చేసుకునే విధంగా ప్రోత్సహిస్తూ.. వారికి రుణాలు ఇప్పించి తిరిగి సక్రమంగా చెల్లించేలా కృషి చేస్తున్నారన్నారు. డ్వాక్రా మహిళా సంఘాలు నిర్వహిస్తున్న లావాదేవీలన్నీ పుస్తక నిర్వహణ చేస్తున్నారని హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఐకేపీవీఓఏ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షులు ఎస్.రమా, అధ్యక్షులు రాజ్‌కుమార్, కార్యదర్శి నగేష్, శ్రీకాంత్, సుధాకర్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్